# హోలీ.. ఆనంద కేళీ..

- సహజసిద్ధ రంగులు క్షేమకరం.. రసాయన రంగులు ప్రమాదకరం
- రంగుల వాడకంలో జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న నిపుణులు



కులమతాలకతీతంగా చిన్నా పెద్ద తేడా లేకుండా అందరూ ఆనందంగా జరుపుకొనే పండుగ హోలీ. పండుగ వేడుకలను ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నారు. హోలీ పండుగకు ఒక రోజు ముందుగా కాముడి దహనం చేస్తారు. వ్యాపారస్తులు వివిధ రకాల రంగులను మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచడంతో పండుగ వాతావరణం నెలకొన్నది. గులాల్, ఆకుపచ్చ, పసుపుపచ్చ, ఎరుపు, బంగారపు రంగుల పొట్లాలను ఒక్కొక్కటి రూ.5 నుంచి రూ.150 వరకు, చిన్నారులు వినియోగించే రంగుల తుపాకులను రూ.20 నుంచి రూ.1200 వరకు విక్రయిస్తున్నారు. కోడిగుడ్లను అదనంగా అమ్ముతున్నారు. హోలీ రోజున నీటిలో రంగులు కలిపి ఒకరిపై ఒకరు చల్లుకుని సరదాగా గడుపుతారు. హోలీకి ముందురోజు గ్రామంలోని నడిబొడ్డున కట్టెలు, పిడకలు ఒకదగ్గర చేర్చి కాముని కాల్చుతూ... యువకులు సంతోషంగా గడుపుతారు. ఈ పండుగపూట రసాయన రంగులు వాడి చర్మానికి రోగాలు కొనితెచ్చుకోకుండా సహజసిద్ధంగా లభించే రంగులను వాడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



### రసాయన రంగులతో..

రసాయన రంగులతో హోలీ పండుగ ఎంత ఉల్లాసాన్ని నింపుతుందో.. అంతే విషాదాన్ని మిగుల్చుతుంది. రంగుల్లో వాడే రసాయన పదార్థాలతో శరీరానికి హాని కలిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కళ్ల మంటలు, ఆస్తమా, చర్మ వ్యాధులు సంభవిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నలుపు రంగులో లెడ్ ఆక్సైడ్ ఉంటుందని, ఇది మూత్రపిండాలను పాడు చేస్తుందని, వెండి రంగులో ఉండే మెర్క్యూరీ సల్ఫేట్‌తో క్యాన్సర్ సోకే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఆకుపచ్చ రంగుల్లో ఉండే కాపర్ సల్ఫేట్ ద్వారా ఎలర్జీతో పాటు శాశ్వత అంధత్వం వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ శాతం డ్రై కలర్స్ అంతగా చర్మానికి, జుట్టుకు చేటు చేయవు. అయితే మెటల్స్ కూడా ఈ పొడుల్లో కలిసిపోయే తరహా రంగులను మాత్రం వాడవద్దు. ముఖ్యంగా సిలికా పార్టికల్స్ అధికంగా ఉన్న రంగుల వాడకం వల్ల చర్మం బాగా పాడయ్యే ఆవకాశాలున్నాయి. పొడిగా ఉండే రంగుల్లో జిలెటిన్ పైలట్ కలవడం వల్ల మైకంతో పాటు ఆస్తమా, అంధత్వం వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది.



### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

> రసాయన మందులతో కళ్లకు హాని కలగకుండా సన్ గ్లాసెస్ వాడాలి. దంతాలపై రంగులు పడకుండా డెంటల్ క్యాప్స్ వేసుకోవాలి.

> వేడుకల్లో మందపాటి పాత దుస్తులు ధరించాలి.

> ముదురు రంగు దుస్తులు మంచిది. ఫుల్ హ్యాండ్స్ షర్ట్, చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు సాక్సులు వేసుకోవాలి.

> కళ్లల్లో రంగు పడితే వెంటనే చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. మంట అనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి.

> తలపై రంగులు పడకుండా క్యాప్ పెట్టుకోవాలి. రంగులు చల్లుకోవడం పూర్తయ్యాక గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి.

> రంగులు చల్లుకున్నప్పుడు శరీరం దురదగా అనిపిస్తే వైద్యులను సంప్రదించాలి

> రంగులను చల్లుకునేటప్పుడు వదులైన దుస్తులను వేసుకోవాలి

> నెత్తిపై, శరీరంపై కోడిగుడ్లను కొట్టుకోరాదు.

### సహజ రంగులతో..

పసుపుతో చేసిన రంగులు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. తులసి ఆకులతో చేసిన రంగులు మానసికోల్లాసానికి తోడ్పడతాయి. శ్వాసక్రియ శక్తిని పెంచుతాయి. కలబంద, వేపాకులు చర్మ వ్యాధులను తగ్గిస్తాయి. దురదల నివారణకు ఉపయోగపడతాయి. గోరింటాకు శరీర పగుళ్లను నివారిస్తుంది. గంధం పొడి మనసుకు ప్రశాంతత కలిగించడంతో పాటు సువాసన వెదజల్లుతుంది.

### చర్మ సంరక్షణకు..

> కొన్ని రంగుల వల్ల ఎలర్జీకి గురయ్యే ఆవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే రంగులు చల్లుకునే ముందు కొబ్బరి నూనె లేదా మాయిశ్చరైజర్‌ను చర్మానికి రాసుకోవాల్సి ఉంటుంది.

> బయటకి కనిపించే భాగాలకు ఆయా రంగులు చర్మంపై పడిన తరువాత దురదగా అనిపిస్తే వెంటనే నీటితో శుభ్రంగా కడిగి మళ్లీ మాయిశ్చరైజర్ పట్టించాలి.

> ఈ రంగుల వల్ల చర్మం పొడిబారిపోయే ఆవకాశాలు కూడా ఉన్నాయి. సెన్సిటివ్ స్కిన్ కోసం క్లీనజర్ వాడడం మరిచిపోవద్దు.

> రంగులను ఎట్టి పరిస్థితుల్లోనూ కళ్లు, ముక్కు, చెవులు, నోటిలోకి ఏ రూపంలోనూ వెళ్లనీయవద్దు.

### జుట్టు సంరక్షణకు..

> హోలీలో వాడే రంగుల వల్ల జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం జరుగుతుంది. ఈ బాధల నుంచి విముక్తి కోసం, రంగుల వల్ల జరిగే నష్ట నివారణ కోసం జుట్టుకు నూనె పెట్టుకోవాల్సిందే.


> రంగులు చల్లుకోవడం పూర్తయిన తరువాత మృదువైన షాంపుతో శుభ్రంగా తలంటుకోవడమే కాదు, కండిషనర్‌ను కూడా వాడాల్సి ఉంటుంది. తద్వారా జుట్టు మళ్లీ ఆరోగ్యకరమైన స్థితికి చేరుకుంటుంది.

> హోలీ ఆడుతున్నప్పుడు జుట్టును పూర్తిగా కప్పేయండి. దీని వల్ల జుట్టు పైనింగ్‌తో పాటు ప్రోటీన్ కూడా కోల్పోకుండా ఉంటుంది.





హోలీకి ముందు రోజు కాముడి దహనం (ఫైల్)



### సహజ రంగుల తయారీ విధానం

> పసుపు, కుంకుమ, పూలు, పండ్లు వివిధ రకాల పిండిని నీటిలో కలిపి ఉపయోగించుకోవచ్చు.

> మోదుగ పూలను ఉడకబెట్టి రంగు తయారు చేసుకోవచ్చు.

> గంధం, ఎర్ర మందారం, గోగుపూలు, దానిమ్మతొక్క, టమాట, క్యారెట్, పసుపు, సున్నం,మిశ్రమం కలిస్తే ఎరుపు రంగు వస్తుంది.

> శనగపిండి, పసుపు మిశ్రమం, బంతి, చామంతిపూల మిశ్రమంతో పసుపు రంగు వస్తుంది.

> గోరింటాకు, గుల్‌మొహర్ ఆకులు, గోధుమ మొలకలు, పాలకూర, కొత్తిమీర, పుదీనాతో ఆకుపచ్చ రంగు తయారుచేసుకోవచ్చు.

> ఇండిగో ప్లాంట్ (సిరా చెట్టు) కాయలతో నీలి రంగు తయారుచేసుకోవచ్చు.

> బీట్‌రూట్, ఉల్లిపాయ తొక్కల మిశ్రమంతో ముదురు కెంపు రంగు వస్తుంది. పారిజాత పూల కాడలను ఎండబెట్టి నానబెడితే సింధూరం రంగు వస్తుంది.

> బ్రౌన్ కలర్ కోసం కాఫీ లేదా టీ పొడి కలిపి వడపోసిన నీళ్లు లేదా మరగబెట్టిన నీళ్లు ఉపయోగించుకోవచ్చు.

> నల్ల ద్రాక్ష రసం లేదా ఎండబెట్టిన పెద్ద ఉసిరికాయలను ఉడికించి రాత్రంతా అలా వదిలేసి మరునాడు నీటిలో కలిపితే నలుపు రంగు తయారవుతుంది. ఎర్ర చందనాన్ని నీటిలో కలిపి ఎరుపు రంగు పొందవచ్చును. గోరింటాకును రుబ్బి పిండిలో కలిపితే ఆకుపచ్చ రంగును తయారు చేసుకోవచ్చు.

> రెండు చెంచాల గంధపు పొడిని లీటర్ నీటిలో కలిపి మరగబెడితే ఎరుపు రంగు ద్రావణం తయారు చేసుకోవచ్చు.


> నీలి మందును నీటిలో కలిపితే నీలి రంగు వస్తుంది.

> తులసి, వేప, కలబంద కలిపి నూరితే ఆకుపచ్చ వర్ణం వస్తుంది.

## హోలీ పర్వదిన శుభాకాంక్షలు







వికారాబాద్, మార్చి 24 : హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్నేహం, సుహృద్భావాల రంగులు మిళితమై సాగే ఈ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాల కనుగుణంగా ఆనందోత్సాహాల మధ్య వేడుక జరుపుకోవాలని వారు అభిలషించారు.

## వాహనాల తనిఖీ

### రూ.16.5 లక్షల నగదు, 5.5 కేజీల వెండి పట్టివేత

షాద్‌నగర్, మార్చి 24 : ఎలాంటి ఆధారాలు లేకుండా పెద్దమొత్తంలో నగదు, వెండిని తరలిస్తుండగా షాద్‌నగర్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. షాద్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని.. ఇందులో భాగంగా మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన జయదేవ్ అనే వ్యక్తి రూ.16.5 లక్షలు, 5.5 కేజీల వెండిని వనపర్తి నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో తరలిస్తుండగా రాయికల్ టోల్‌గేట్ వద్ద పట్టుకున్నామని వివరించారు. నగదుకు, వెండికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేవని.. నగదు, వెండిని స్వాధీనం చేసుకుని ఐటీ అధికారులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీ ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా నగదు ని, ఇతర విలువైన వస్తువులను తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు.

### తాండూరు మండలంలో రూ.2,93,830

తాండూరు రూరల్ : వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం కరణ్‌కోట పోలీసులు గౌతాపూర్ సమీపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేశారు. రూ.2,93,830లను తాండూరులోని సీసీఐ కాలనీకి చెందిన మహ్మద్ అనాజ్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ డబ్బులకు ఎలాంటి పత్రాలు లేనందుకు వీటిని సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు.



తాండూరు రూరల్ : గౌతాపూర్ వద్ద వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ నగదు

# వీధి వ్యాపారులకు చేయూత..!

- జీహెచ్‌ఎంసీ సర్వేలో 1,65,638 మంది గుర్తింపు
- 1,65,301 మందికి గుర్తింపు కార్డుల జారీ
- వ్యాపారాభివృద్ధికి గాను రూ.130.76 కోట్ల సర్దుబాటు
- తాజాగా మూడో విడుత పంపిణీకి శ్రీకారం
- వీధి వ్యాపారుల్లో జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా చర్యలు



### స్ట్రీట్ వెండర్స్ వివరాలు

- వీధి వ్యాపారులను గుర్తించినవి 1, 65,638
- ఐడీ కార్డులు జారీ చేసినవి 1,65,301
- టౌన్ వెండింగ్ కమిటీల ఏర్పాటు 584 గ్రూపులు

సిటీబ్యూరో, మార్చి 24(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతనందించి, వారిలో జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకుంటున్నది. తాజాగా వీధి వ్యాపారులకు మూడో విడుతలో ఒక్కొక్కరికి రూ.50 వేల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రుణాల పంపిణీలో భాగంగా వీధుల్లో తిరుగుతూ చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూతనందించే ఉద్దేశంతో హైదరాబాద్ మహా నగరంలో సర్వే చేయగా, 1,65,638 మందిని గుర్తించారు. అందులో భాగంగా 1,65,301 మందికి గుర్తింపు కార్డులను జారీ చేశారు. 30 వెండింగ్ కమిటీలను ఏర్పాటుతో పాటు 584 కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే మూడో విడుతలో 5,808 మందికిగాను రూ.28.69 కోట్ల రుణాలను అందజేయగా, మొత్తం మూడు విడుతల్లో 85,441 మందికి రూ.130.76 కోట్ల రుణాలను అందించారు. కాగా ఇప్పటివరకు రూ.2.24 కోట్లను వీధి వ్యాపారులు క్యాష్ బ్యాక్ చేశారు.

**వీధి వ్యాపారుల్లో మరింత చైతన్యం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఆమలు చేస్తున్న వీధి వ్యాపారుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పీఎం సురక్ష బీమా యోజన, జీవన జ్యోతి బీమా యోజన, శ్రమయోగి మందన్ ఫించన్ యోజన, మాతృవందన యోజన, జననీ సురక్షణ యోజన, జన్‌ధన్ యోజన, వన్ నేషన్ వన్ కార్డు తదితర పథకాలను మరింత పకడ్బందీగా అందించేందుకు వీధి వ్యాపారుల పూర్తి వివరాలతో కూడిన సమాచారాన్ని పొందుపర్చేందుకు వెబ్ ఆధారిత ప్రత్యేక సమగ్ర యాప్‌ను రూపొందించింది. ఇందులో భాగంగానే వీధి వ్యాపారులను చైతన్యం చేసే వారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు 'మై బీ డిజిటల్' అనే కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. వీటితో పాటు వీధి వ్యాపారులతో స్విగ్గీ, జొమాటోలు ఒప్పందం కుదుర్చుకుంటుండటం గమనార్హం.

**రుణాల పంపిణీ**

| టర్మ్ | దరఖాస్తులు | అర్హత పొందినవి/రుణాల మంజూరు(రూ.కోట్లలో) | రుణాల పంపిణీ (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| మొదటి విడుత | 81,979 | 57,348/రూ.57.31 | 56,802/రూ.56.49 |
| రెండో విడుత | 38,179 | 23,091/రూ.46.11 | 22,831/రూ.45.58 |
| మూడో విడుత | 6,814 | 5898/రూ.29.18 | 5808/రూ.28.69 |
| | 1,26,972 | 86,337/రూ.132.60 | 85,441/రూ.130.76కోట్లు |



# మార్ఫింగ్ ఫొటోలతో వేధిస్తున్నారా..?

రుణం తీసుకున్న సమయంలోనే మన ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు సైబర్ నేరగాళ్ల చేతికి ఇచ్చేస్తున్నాం. సైబర్ నేరగాళ్లు చేసే బ్లాక్ మెయిలింగ్‌కు భయపడకపోతే, అశ్లీల ఫొటోల అస్త్రం వాడుతారు. అందులో ఇంటర్‌నెట్ నుంచి నగ్న ఫొటోలు సేకరించి, ఆ ఫొటోలో వ్యక్తి తలను తొలగించి బాధితుల ఫొటో తలను అతికిస్తారు. దీంతో ఈ మార్ఫింగ్ ఫొటోలను చూడగానే బాధితులు షాక్‌కు గురవుతారు. ఇక్కడే బాధితులు ధైర్యంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఆ ఫొటోలు మార్ఫింగ్‌వనే విషయాన్ని గుర్తించాలంటున్నారు. అలాంటి ఫోన్ కాల్స్, ఫొటోలను ఎవరైనా పంపిస్తే మీ దగ్గరి వాళ్లకు విషయం చెప్పాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇదంతా సైబర్ నేరగాళ్ల పని అని.. మీ కాంటాక్టుల్లో ఉన్నవాళ్లకు చెప్పాలంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

| లోన్ యాప్‌ల నుంచి బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్స్ | అందిన కాడికి దోచేసే ప్రయత్నం | సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్‌కు భయపడొద్దు.. | పోలీసులను సంప్రదించండి |
|---|---|---|---|

సిటీబ్యూరో, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : నగరానికి చెందిన 29 ఏండ్ల యువకుడు తన అవసరం నిమిత్తం లోన్ యాప్ ద్వారా కొంత రుణం తీసుకొని.. తిరిగి రుణం చెల్లించాడు. అయితే, రుణ యాప్ రికవరీ ఏజెంట్లు ఫోన్ చేసి.. నీవు ఇంకా రూ. 95,500 చెల్లించాల్సి ఉంది.. అంటూ ఒత్తిడి తెచ్చారు. నేను ఇదివరకే రుణం చెల్లించానంటూ.. ఎంత చెప్పినా వినకుండా నీవు డబ్బు చెల్లించకపోతే నీ ఫొటోలు మీ వాళ్లందరికి పంపించి.. ఇజ్జత్ తీస్తామంటూ బెదిరించారు. నీ ఇష్టం వచ్చింది చేసుకో.. అంటూ బాధితుడు గట్టిగానే బదులిచ్చాడు. ఆ తర్వాత సైబర్‌నేరగాళ్లు బాధితుడి మార్ఫింగ్ ఫొటోలను అతడి సెల్‌ఫోన్‌లో ఉన్న కాంటాక్టు నంబర్లకు పంపించారు. అందులో కుటుంబ సభ్యులు, చుట్టాలు ఉన్న మహిళల ఫోన్ నంబర్లకు ప్రత్యేకంగా ఆ ఫొటోలను పంపించారు. ఈ విషయం తెలుసుకున్న బాధితుడు షాక్‌కు గురయ్యాడు. అన్నట్లే తన ఇజ్జత్ మొత్తం పోయిందంటూ కుమిలిపోతూ మనస్తాపానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పి.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది.. ఇది ఒక్కరి సమస్య కాదు.. ప్రతి రోజూ సైబర్‌క్రైమ్ ఠాణాలకు ఇలాంటి బాధితులు ఎందరో వస్తున్నారు.

**కాంటాక్ట్స్ ఇస్తున్నారు..!**

కొందరు అవసరాల కోసం రుణం తీసుకుంటుండగా, మరికొందరు యాప్‌లలో రుణం తీసుకొని ఆ తరువాత కడితే కడుదాం.. లేదంటే లేదు.. అన్న ధోరణితో ఉంటారు. అవసరాల నిమిత్తం తీసుకొని, అప్పు విషయం ఎవరికీ తెలియకుండా ఉండేలా వడ్డీలకు వడ్డీలు చెల్లిస్తూ తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేందుకు ప్రయత్నిస్తుంటారు. రుణం ఇచ్చే సమయంలోనే మన ఫోన్ కాంటాక్టులన్ని లోన్ యాప్ నిర్వాహకుల చేతిలోకి వెళ్లిపోతాయి. బాధితుల ఫోన్‌లోని కాంటాక్ట్స్ ఇవ్వకుంటే రుణం ఇచ్చేందుకు యాప్‌లు ఒప్పుకోవు. దీంతో తప్పనిసరిగా లోన్ యాప్ నిర్వాహకులు చెప్పినట్లే నడుచుకోవాల్సి వస్తుంది. అవసరాల కోసం రుణం తీసుకున్న ఇలాంటి వారినే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా టార్గెట్ చేస్తుంటారు. తీసుకున్న రుణానికి రెండు మూడింతలు తిరిగి తీసుకుంటున్నారు. అయినా కూడా వేధింపులు మానకుండా అందినకాడికి దోచేద్దామనే ఆలోచనతో లోన్ యాప్ రికవరీ ఏజెంట్లు ఉంటారు. ఇందులో కొందరు నేరుగా లోన్ యాప్‌ల ద్వారా చేస్తుండగా, మరికొందరు లోన్ యాప్‌ల నుంచి రికవరీ ఏజెంట్లు పనిచేస్తున్నారు. బాధితులు వారి చేతికి దొరికారంటే ఎంతవరకైనా వెళ్తామని ఈ లోన్ యాప్‌లకు సంబంధించిన రికవరీ ఏజెంట్లు వ్యవహరిస్తుంటారు. ఏజెంట్లు ఎంత వసూలు చేస్తే వారికి అంత కమీషన్ పెరుగుతూ వస్తుంది. దీంతో వెనుకా ముందు ఆలోచించకుండా బాధితుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తుంటారు. అవసరమైతే బ్లాక్ మెయిలింగ్‌కు కూడా ఏజెంట్లు దిగుతుంటారు.



ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కడ్తాల్‌లో కాముడి దహనం

## ఘనంగా కాముడి దహనం

కడ్తాల్, మార్చి 24 : మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల్లో హోలీ పండుగను పురస్కరించుకొని ఆదివారం రాత్రి కాముడి దహనం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రధాన చౌరస్తాలో అర్చకుడు ఎల్లికంటి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా కాముడి దహనం నిర్వహించారు. సహజసిద్ధమైన రంగులతో హోలీ వేడుకలను జరుపుకోవాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శ్రీను, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, గణేశ్‌గౌడ్, జంగారెడ్డి, జహంగీర్‌అలీ, వెంకటేశ్, పాండు, సత్యం, రాజేశ్, సంతోశ్, నరేశ్, అశోక్‌రెడ్డి, మహేశ్, భానుకిరణ్, సురేశ్, రవి, గ్రామ పెద్దలు, యువకులున్నారు.

## టెట్ పరీక్షా ఫీజును తగ్గించాలని సీఎంకు లేఖ


ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 24 : టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజును తక్షణమే తగ్గించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టెట్ పరీక్షా ఫీజును ఒక్కో పేపర్‌కు రూ.200–రూ.1000కి పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొనడాన్ని తప్పుబట్టారు. అధిక ఫీజులు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నదని గుర్తు చేశారు. టెట్‌ను, దాని నిర్వహణను పక్కనబెట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజులను ఐదింతలు పెంచిందని మండిపడ్డారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. తక్షణమే ఫీజులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.





## విధులకు డాక్టర్ డుమ్మా..

కులకచర్ల, మార్చి 24 : కులకచర్ల ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న వాజిహుద్దీన్ సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వాస్పత్రికి వెళితే ఒకే ఒక వైద్యురాలు ఉండడం వల్ల రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని దవాఖాన సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఈ నెల 5 నుంచి ఆస్పత్రికి గైర్హాజరవుతుండడం విశేషం. ఈ విషయంపై దవాఖాన హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా ఈ నెల 5నుంచి సంతకాలు చేయలేదు. దీనిపై స్థానిక సీహెచ్‌వో చంద్రప్రకాశ్‌ను వివరణ కోరగా.. డాక్టర్ వాజిహుద్దీన్‌పై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, దవాఖాన సిబ్బంది కోరుతున్నారు.





కులకచర్ల ప్రభుత్వాస్పత్రి హాజరు పట్టిక